సాక్షి
అనంతపురం

గురువారం । 2 । నవంబర్ । 2023



చీనీ టన్ను రూ.26 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.26 వేలు పలికాయి.



టమాట కిలో రూ.21

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.21 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.16 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.7°/ 20.2°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేకువజామున చలి వాతావరణం కనిపించింది. తూర్పు దిశగా గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

యశ్వంతపుర-బీదర్ మధ్య వీక్లీ రైళ్లు



యశ్వంతపుర-బీదర్ మధ్య నడిచే రైలు

అనంతపురం సిటీ: యశ్వంతపుర-బీదర్ మధ్య వచ్చే శని, ఆదివారం నుంచి వారాంతపు (వీక్లీ) రైళ్లు నడపనున్నట్లు అనంతపురం రైల్వే స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్‌కుమార్ బుధవారం తెలిపారు. యశ్వంతపురలో వచ్చే శనివారం రాత్రి 11.15 గంటలకు బయలుదేరే ఎక్స్‌ప్రెస్ (నంబర్: 16577) రైలు హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, గుల్బర్గా మీదుగా బీదర్‌కు ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుకుంటుందన్నారు. మార్గమధ్యంలో అనంతపురానికి తెల్లవారుజామున 4.38 గంటలకు వస్తుందని వివరించారు. తిరిగి ఆదివారం మధ్యాహ్నం 2.40 గంటలకు బీదర్‌లో బయలుదేరే రైలు (నంబర్: 16578) తిరిగి అదే మార్గంలో యశ్వంతపురకు రాత్రికి చేరుకుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైద్య శిబిరాలతో 'ఆరోగ్యమస్తు'



రాయదుర్గంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: తమ చెంతనే నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజలు తరలివచ్చి వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకుని, వైద్యం పొందుతున్నారు. బుధవారం జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించగా.. 3,074 మంది ఓపీ సేవలు వినియోగించుకున్నారు. కాగా వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న 475 మందిని స్పెషలిస్టు వైద్యులు జిల్లా ఆస్పత్రులకు రెఫర్ చేశారు. వైఎస్సార్ కంటి వెలుగు కింద 28 మంది వైద్యం పొందారు. డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి తాడిపత్రిలోని అంబేడ్కర్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో జరిగిన వైద్య శిబిరాలను పరిశీలించారు. గురువారం జిల్లాలో నాలుగు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు.

ఆలస్యంగా నడిచిన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్



బెంగళూరు-భువనేశ్వర్ మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు

అనంతపురం సిటీ: బెంగళూరు – భువనేశ్వర్ మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు (నంబర్ 18464) బుధవారం ఐదు గంటలు ఆలస్యంగా నడిచింది. ఈ రైలు మధ్యాహ్నం 1.45 గంటలకు బెంగళూరులో బయలుదేరాల్సి ఉండగా, సాయంత్రం 7 గంటలకు బయలుదేరింది. దీనికి ప్రధాన కారణం గుంటూరు డివిజన్‌లో పనులు జరుగుతున్న కారణంగా భువనేశ్వర్ నుంచి బయలుదేరిన రైలు బుధవారం ఉదయం 11.45 గంటలకు బెంగళూరుకు చేరుకోవాల్సి ఉండగా, సాయంత్రం 5.45కు చేరుకుంది. దీని ప్రభావం తిరుగు ప్రయాణంపై పడింది. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు ఐదు గంటలు ఆలస్యంగా రావడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

'నాసిన్'కు ఎయిర్‌బస్!



'నాసిన్' కొనుగోలుచేసిన విమానం

గోరంట్ల: పాలసముద్రం సమీపంలో ఏర్పాటు కాబోతున్న నేషనల్ అకాడమీ అఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్, నార్కోటిక్స్ సంస్థ (నాసిన్) ఎయిర్‌బస్‌ను కొనుగోలు చేసింది. అకాడమీలో సెంట్రల్ బోర్డ్ అఫ్ ఇన్‌డైరెక్టు ట్యాక్సెస్ (సీబీఐసీ) అనుబంధ ఏజెన్సీల అధికారులకు స్మగ్లింగ్ నిరోధక కార్యకలాపాలు, పేలుడు పదార్థాలను గుర్తించడంలో శిక్షణ ఇచ్చేందుకు ఎయిర్ బస్ కొనుగోలు చేసినట్లు సంస్థ ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిలిపి ఉంచిన ఎయిర్ ఇండియాకు చెందిన ఎయిర్ బస్సు (ఏ321 వీటీపీపీఎన్)ను అక్టోబర్ 10వ తేదీన నాసిన్ కొనుగోలు చేసిందన్నారు. ఆ తర్వాత ఎయిర్ బస్‌ను విడదీసి ట్రావెలర్ ద్వారా రోడ్డుమార్గం గుండా గురువారం పాలసముద్రానికి తీసుకురానున్నట్లు వెల్లడించారు.

పైపై పూత.. నిధుల మేత!

ముదిగుబ్బ బైపాస్ రోడ్డు పనుల్లో నాణ్యత నగుబాటుగా మారింది. పనులు దక్కించుకున్న నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ నిబంధనలకు పాతరేస్తూ పైపై పూతలతో పనులు చేస్తోంది. రోడ్డు నిర్మాణంలో భాగంగా వేసిన బ్రిడ్జి పిల్లర్లు అప్పుడే బీటలు వారగా, కాంక్రీట్ వాల్ ఉబ్బిపోయింది. ఆమ్యామ్యాలకు అలవాటుపడిన అధికారులు కళ్లుమూసుకుని బిల్లులపై సంతకాలు చేసేస్తున్నారు.

నాసిరకంగా ముదిగుబ్బ బైపాస్ రోడ్డు పనులు

- ప్రజల భద్రత గాలికి వదిలిన 'నితిన్ సాయి' కంపెనీ
- బ్రిడ్జి కింది భాగం పిల్లర్లకు బీటలు
- బయటకు ఉబ్బిన ప్రీకాస్టెడ్ కాంక్రీట్ వాల్
- సిమెంట్‌తో మేకప్ చేస్తూ అక్రమాలు కప్పిపుచ్చుతున్న వైనం
- నాణ్యత పట్టించుకోకుండానే బిల్లులు చేస్తున్న అధికారులు



ముదిగుబ్బ బైపాస్ రోడ్డు పనులలో భాగంగా నూతనంగా నిర్మించిన బ్రిడ్జి కింది భాగంలో ఏర్పడ్డ పగుళ్లను సిమెంట్‌తో కప్పి పుచ్చిన దృశ్యం



బ్రిడ్జికి ఇరువైపుల ఫ్రీకాస్టెడ్ వాల్ ఉబ్బడంతో కనపడకుండా సిమెంట్‌తో కప్పివేసిన దృశ్యం

ధర్మవరం: ప్రజలకు మెరుగైన రహదారులు కల్పించి సుఖవంతమైన ప్రయాణం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రాన్ని ఒప్పించి మరీ ముదిగుబ్బకు బైపాస్ రహదారిని మంజూరు చేయించారు. అందులో భాగంగా 2021 డిసెంబర్‌లో రూ.116.81 కోట్ల వ్యయంతో ముదిగుబ్బ నుంచి 7.749 కిలోమీటర్ల పొడవున ఎన్‌హెచ్–42 బైపాస్ రోడ్డును నిర్మించేలా టెండరు పిలిచారు. మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరికి చెందిన నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఈ పనులు దక్కించుకుంది. నిబంధనలకు పాతరేస్తూ బైపాస్ రోడ్డు పనుల్లో అంతులేని అక్రమాలకు పాల్పడుతోంది.

నాణ్యత గాలికి..

బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్ ఇటీవల నిర్మించిన బ్రిడ్జి పనులను చూస్తే నాణ్యత తేటతెల్లమవుతోంది. బ్రిడ్జి నిర్మాణంలో నిలువు కాంక్రీట్ వాల్ వద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. నాసిరకం కాంక్రీట్ మిశ్రమం వాడటం వల్లే ఇలా జరిగిందని నిపుణులు చెబుతున్నారు. అలానే బ్రిడ్జి ఉపరితలంలో మట్టికట్ట పనులు లేయర్ల వారీగా సరిగా చేయక పోవడంతో ఇరువైపులా ఉన్న ఫ్రీకాస్టెడ్ కాంక్రీట్ వాల్ బయటకు ఉబ్బింది. దీంతో నాసిరకం పనులు ఎక్కడ బయటపడతాయోనని కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ సిమెంట్‌తో ప్లాస్టింగ్ చేసి మేకప్ చేసింది.

పట్టించుకోని అధికారులు..

ముదిగుబ్బ బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి నాసిరకంగా జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. పైపెచ్చు పనుల నాణ్యతను పరిశీలించకుండానే విడతల వారీగా సదరు కంపెనీకి బిల్లులు మంజూరు చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారుల సైతం నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీతో లాలూచీ పడటంతోనే అవినీతి పెచ్చుమీరుతున్నట్లు తెలుస్తోంది.

సెంట్రల్ విజిలెన్స్‌కు ఎంపీ మాధవ్ ఫిర్యాదు

ముదిగుబ్బ బైపాస్ రోడ్డు నిర్మాణ పనులలో జరుగుతున్న అక్రమాలపై హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ సెంట్రల్ విజిలెన్స్ అధికారులకు లేఖ రాశారు. పనుల్లో అక్రమాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. బైపాస్ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని కోరారు.

'విజిలెన్స్'పై కంపెనీ ప్రతినిధుల దౌర్జన్యం

బైపాస్‌రోడ్డు నిర్మాణ పనులలో జరుగుతున్న అక్రమాలను విచారించేందుకు వెళ్లిన విజిలెన్స్ అధికారులపై గతంలో నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రతినిధులు దౌర్జన్యం చేశారు. విజిలెన్స్ అధికారుల ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లడంతో పాటు పనులు పరిశీలించకుండా అడ్డుకున్నారు. దీంతో అధికారులు సైతం నిస్సహాయ స్థితిలో ఉన్నారు. ఏది ఏమైనా ప్రజల భద్రతతో ముడిపడి ఉన్న ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి పనులు నాణ్యత జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై నేషనల్ హైవే ఈఈ మధుసూదన్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా, ఆయన స్పందించలేదు.

'శోత్రియం'పై అధికారుల్లో గుబులు

సాక్షికి స్పందన

కళ్యాణదుర్గం: శోత్రియం పేరిట జరిగిన భూమాయ కలకలం రేపింది. శెట్టూరు మండలం అయ్యగార్లపల్లిలో జరిగిన శోత్రియం భూముల మాయపై 'సాక్షి'లో బుధవారం కథనం ప్రచురితమైంది. 2018లో రైత్వారీ పట్టాలపై సంతకాలు చేసిన తహసీల్దార్, రెవెన్యూ అధికారుల్లో గుబులు మొదలైంది. దీంతో పాటు నియోజకవర్గ స్థాయి పోలీసు, రెవెన్యూ అధికారులు సైతం 'సాక్షి' కథనంపై చర్చించుకున్నారు. అప్పట్లో పనిచేసిన రెవెన్యూ అధికారులు ప్రస్తుతం పలు మండలాల్లో విధుల్లో ఉండగా, అప్పట్లో రైత్వారీ పట్టాలిచ్చిన తహసీల్దార్ ప్రస్తుతం వాలంటరీ రిటైర్మెంట్‌లో ఉన్నారు. ఆయనతో కూడా కొందరు ఉద్యోగులు ఈ విషయంపై చర్చించినట్లు విశ్వసనీయ సమాచారం. అక్రమంగా మంజూరు చేసిన పట్టాలు రద్దు చేసి.. ఇదివరకు సాగులో ఉన్న, ఇళ్లు నిర్మించుకుని ఉన్న వారికి న్యాయం జరిగేదాకా తాము పోరాడతామని అయ్యగార్లపల్లి గ్రామస్తులు చెప్పారు.

నిర్ణీత పరీక్ష ఫీజు మాత్రమే వసూలు చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: మార్చి–2024లో జరిగే పదో తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని యాజమాన్యాల పాఠశాలలు విద్యార్థుల నుంచి నిర్ణీత ఫీజు మాత్రమే వసూలు చేయాలని డీఈఓ వి.నాగరాజు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి రెగ్యులర్ విద్యార్థుల నుంచి పరీక్షల ఫీజు రూ.125 మాత్రమే వసూలు చేయాలని పేర్కొన్నారు. కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు రూ.500 – రూ.1000 దాకా వసూళ్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే రూపాయి అదనంగా వసూలు చేసినా సంబంధిత పాఠశాలల యాజమాన్యాలపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఐదేళ్లలో తొలిసారి కరువు ఛాయలు

- నైరుతి నైరాశ్యంతో దుర్భిక్ష పరిస్థితులు
- 49 కరువు మండలాల ప్రకటన

అనంతపురం అగ్రికల్చర్: గత నాలుగేళ్లు సమృద్ధిగా వర్షాలు కురిపించిన వరుణుడు ఐదో ఏడాది విరామం తీసుకున్నాడు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరువు ఛాయలు అలుముకున్నాయి. ఖరీఫ్ సేద్యానికి అత్యంత కీలకమైన నైరుతి రుతుపవనాలు ఏమాత్రమూ ప్రభావం చూపకపోవడంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అనంతపురం జిల్లాలో జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య నాలుగు నెలల ఖరీఫ్ కాలంలో 319 మి.మీ వర్షం పడాల్సి వుండగా 22.6 శాతం తక్కువగా 247.4 మి.మీ నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లాలో కూడా 365.5 మి.మీ గానూ 16.7 శాతం తక్కువగా 297 మి.మీ నమోదైంది. దీంతో కరువు నెలకొంది. చంద్రబాబు పాలించిన 14 ఏళ్లలో వర్షాలు లేక, పంటలు పండక ఏకంగా 11సార్లు కరువు ఏర్పడింది. అప్పట్లో ప్రభుత్వం కంటితుడుపుగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడం మినహా చేసిన సాయం చాలా తక్కువేనని రైతులు చెబుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు అడుగడుగునా అండగా నిలి



చారు. రైతు భరోసా, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్‌సబ్సిడీ, పంట రుణాలపై సున్నావడ్డీ, కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) లాంటి కార్యక్రమాలు, పథకాలతో రైతు కష్టనష్టాల్లో వెన్నంటి ఉంటామని సర్కారు గత నాలుగేళ్లుగా భరోసా కల్పించింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు నుంచి రైతును గట్టెక్కించేందుకు తాజాగా కరువు మండలాలను ప్రకటించింది.

కరువు జాబితాలో 49 మండలాలు

వర్షపాతం, అందులో వర్షపాత విరామాలు (డ్రైస్పెల్స్), సాగు చేసిన పంటల విస్తీర్ణం, భూగర్భజలాల లభ్యత, పంట దిగుబడుల అంచనా... తదితర కొలమానం ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో 49 మండలాలను కరువు మండలాలుగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో అనంతపురం జిల్లాలో బెళుగుప్ప, బొమ్మనహాళ్, యల్లనూరు మినహా మిగతా 28 మండలాలను తీవ్ర కరువు (సివియర్ డ్రాట్) జాబితాలో చేర్చింది. అలాగే శ్రీ సత్యసాయి జిల్లాలో 21 మండలాలను కరువు జాబితాలో చేర్చారు. అందులో ఎన్‌పీ కుంట, మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి, పరిగి... ఈ ఏడు మండలాలను తీవ్ర కరువు జాబితాలో చేర్చగా.. కనగానపల్లి, ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల, బుక్కపట్నం, కొత్తచెరువు, రొద్దం, గోరంట్ల, సోమందేపల్లి, హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు ఈ 14 మండలాలను సాధారణ కరువు (మోడరేట్ డ్రాట్) మండలాలుగా ప్రకటించారు.

- ఉమ్మడి జిల్లాలో ఉన్న 63 మండలాల్లో 49 మండలాలు కరువు జాబితాలో చేరగా... మిగతా 14 మండలాల్లో కూడా పరిస్థితి అలాగే ఉన్నందున వాటిని కూడా కరువు జాబితాలో ప్రకటించాలని జిల్లా ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. త్వరలో కరువు నివారణకు చర్యలు తీసుకోనున్నారు.

ఎంటెక్, ఎంఫార్మసీ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో సెప్టెంబర్, అక్టోబర్ నెలలో నిర్వహించిన ఎంటెక్ రెండో సెమిస్టర్ (ఆర్–21), రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంటెక్ ఒకటి, మూడో సెమిస్టర్ (ఆర్–21, ఆర్–17) సప్లిమెంటరీ, ఎం ఫార్మసీ రెండో సెమిస్టర్ (ఆర్–21), మూడో సెమిస్టర్ (ఆర్–21, ఆర్–17), సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడొచ్చని పేర్కొన్నారు.

పండుగలా పింఛన్ల పంపిణీ


అనంతపురం: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ జిల్లాలో పండుగలా సాగింది. బుధవారం ఉదయం నుంచే వలంటీర్లు అవ్వా తాతలు, వితంతు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వివిధ రకాల చేతి వృత్తిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ చేపట్టారు. జిల్లాలో మొత్తం 2,87, 369 మంది లబ్ధిదారులు ఉండగా, తొలి రోజే 1,80,035 మందికి (77.40 శాతం) పింఛన్ అందజేశారు. ఠంచన్‌గా పింఛన్ అందడంతో లబ్ధిదారుల మోములో సంతోషం కనిపించింది.



అనంతపురం 44వ డివిజన్‌లో పింఛన్‌దారుతో బయోమెట్రిక్ వేయిస్తున్న వలంటీర్ శ్రీనివాసరావు

న్యాయం గెలిచిందా? రోగం గెలిచిందా?

- అనారోగ్య కారణాలతోనే బాబుకు బెయిలు
- స్కిల్ స్కాం కేసులో నిర్దోషని కోర్టు చెప్పలేదు
- రక్తాభిషేకం చేయడం రాక్షసత్వమే
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: 'స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టై అయ్యి రిమాండ్ ఖైదీగా జైలులో ఉన్న చంద్రబాబుకు కంటి చికిత్స కోసం హైకోర్టు కండీషన్లతో మధ్యంతర బెయిలు ఇచ్చింది. అయితే టీడీపీ నాయకులు న్యాయం గెలిచింది అంటూ సంబరాలు చేసుకుంటున్నారు. నిజంగా ఆయనకు సంబంధం లేకపోతే.. ప్రజాధనం దుర్వినియోగంలో పాత్ర లేకపోతే కేసు నుంచి ఎందుకు బయటపడలేదు.. ఎందుకు బెయిలు రాలేదు? కుంభకోణంలో అడ్డంగా దొరికిపోవడంతో అన్ని దారులూ మూసుకుపోయి.. చివరకు కంటి సమస్య కింద మధ్యంతర బెయిలు తెచ్చుకున్నారు. నిజాయితీ నిరూపించుకుని బెయిలుపై బయటికొచ్చారా.. లేక చికిత్స కోసం బయటకు రావడానికి బెయిలు తెచ్చుకోవడంలో గెలిచారా?' అని టీడీపీ శ్రేణులను రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం ఆయన అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు. కండీషన్లతో బెయిలు వచ్చినా టీడీపీ నాయకులు బాణాసంచా కాల్చుతున్నారని, ఇంకొందరు జంతుబలు ఇచ్చి సభ్యసమాజం తలదించుకునేలా వ్యవహరించారని అన్నారు. 73 ఏళ్ల వయస్సులో అనేక దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న చంద్రబాబుకు కంటి ఆపరేషన్ చేయించుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు ధ్రువీకరణపత్రం ఇవ్వడంతో 28 రోజుల పాటు బెయిల్ ఇచ్చారన్నారు. బెయిలు అంశంలో ఎక్కడా కేసు పూర్వాపరాల గురించి ప్రస్తావించలేదన్నారు. స్కాంలో చంద్రబాబు పాత్ర లేదనే విషయాన్ని ఎక్కడా వెల్లడించలేదన్నారు. బాబు జైలులో ఉంటే లోకేష్ ఆదేశాల మేరకు 54 రోజులపాటు టీడీపీ శ్రేణులు విజిల్స్ వేయడం, ప్లేట్లను గరిటెలతో కొట్టడం, కొవ్వొత్తుల ర్యాలీలు చేయడం వంటి విన్యాసాలు చేశారన్నారు. కండీషన్ బెయిలు మంజూరుతో ఎట్టకేలకు బలవంతపు నిరసనలు చేపట్టే పని తప్పిందని టీడీపీ శ్రేణులు సంతోషంతో బాణా సంచా పేలుస్తున్నాయని ఎద్దేవా చేశారు. బెయిలు మంజూరు నేపథ్యంలో టీడీపీ శ్రేణులు ఆత్మకూరు మండలం సిద్దరాంపురంలో జంతుబలి చేసి చంద్రబాబు చిత్రపటానికి రక్తాభిషేకం చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇలాంటి రాక్షసమైన పనులు చేయకుండా చంద్రబాబుపై నిజంగా అభిమానం ఉంటే దేవాలయాలకు వెళ్లి పూజలు చేసుకోవాలని హితవుపలికారు.

బాబు త్వరగా కోలుకోవాలి

ఎంపీ గోరంట్ల మాధవ్ చేసిన వ్యాఖ్యలను సైతం టీడీపీ వక్రీకరించిందని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, దీంతో చంద్రబాబు రాజకీయంగా సమాధి అవుతారనే ఉద్దేశంతో మాట్లాడారన్నారు. చంద్రబాబు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

జిల్లాను ప్రగతి పథంలో నడిపిద్దాం





పొట్టి శ్రీరాములు, తెలుగుతల్లికి పుష్పాంజలి ఘటించిన కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎస్పీ అన్బురాజన్, మేయర్ వసీం, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

- ఆమరజీవి పొట్టిశ్రీరాములు చిరస్మరణీయులు
- రాష్ట్ర అవతరణ దినోత్సవంలో కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: సమష్టి కృషితో జిల్లాను ప్రగతిపథంలో నడిపిద్దామని కలెక్టర్ గౌతమి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఏఆర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ నేతృత్వంలోని సాయుధ దళం సమర్పించిన గౌరవ వందనాన్ని కలెక్టర్ స్వీకరించారు. అనంతరం రెవెన్యూ భవన్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు (దేవదాయ) జ్వాలాపురం శ్రీకాంత్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, మేయర్ వసీం తదితరులు పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెలుగుతల్లి చిత్రపటానికి వందనం సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు ప్రాణ త్యాగ ఫలమే రాష్ట్ర అవతరణ అన్నారు. అంతటి మహనీయున్ని స్మరించుకోవాల్సిన్సాన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మహనీయుల స్ఫూర్తితో జిల్లాను అభివృద్ధిపథంలో నడిపించడమే లక్ష్యంగా అందరూ పనిచేయాలన్నారు. ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టిందన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములును స్మరించుకోవడం మన కర్తవ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. మహనీయుల స్ఫూర్తితో అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. మహాత్ములు కోరుకున్న సామాజిక న్యాయం, సమ న్యాయం అందిస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. ఆయనకు మనమంతా అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, డీఆర్‌ఓ గాయత్రీదేవి, అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, హనుమంతు, సెబ్ ఏఎస్పీ రామకృష్ణ, ఆర్డీఓలు గ్రంధి వెంకటేశ్, రాణి సుస్మిత, సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రాష్ట్ర అవతరణ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. అనంతపురం డ్యాన్స్ స్టూడియో అర్జున్ భరద్వాజ్ నాట్య బృందం చేసిన భరతనాట్యం, కూడేరు కేజీబీవీ విద్యార్థినులు చేసిన 'నమో నమో జగతి ఆంధ్రప్రదేశ్' అంటూ చేసిన నృత్య ప్రదర్శన, అరవింద్ ఆర్ట్స్ అకాడమీ చిన్నారులు 'అదిగో అల్లదిగో '' అంటూ చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన చిన్నారులు, విద్యార్థినులను కలెక్టర్ అభినందించి, శాలువా, మెమొంటోతో సత్కరించారు.

క్లుప్తంగా

పెండింగ్ కేసులపై దృష్టి పెట్టండి



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అన్బురాజన్

పెద్దపప్పూరు: పెండింగ్ కేసులపై దృష్టిసారించి సకాలంలో పరిష్కరించాలని ఎస్పీ అన్బురాజన్ అన్నారు. బుధవారం పెద్దపప్పూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మట్కా, పేకాట, అక్రమ మద్యం , ఇసుక రవాణపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. శాంతి భద్రతల నియంత్రణలో భాగంగా సమస్యాత్మక గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి గ్రామస్తుల్లో అవగాహన కల్గించాలని సూచించారు. రికార్డుల్లో రౌడీషీటర్లుగా ఉన్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు.

డీసీసీబీలో 65 మందికి ప్రొబేషన్ డిక్లేర్



ప్రొబేషన్ డిక్లేర్ పత్రాలు అందించిన డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో ఏడాది కిందట ఉద్యోగం చేసిన 65 మందికి బుధవారం ప్రొబేషన్ డిక్లేర్ చేస్తూ ఉత్తర్వు పత్రాలను ఇచ్చారు. స్థానిక డీసీసీబీ హాలులో జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ ఎం.లిఖిత వారికి పత్రాలు అందజేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ... ఏడాది కిందట డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కింద ఉద్యోగం పొందిన 85 మందిలో 65 మందికి ప్రొబేషన్ డిక్లేర్ చేశామన్నారు. అందులో అసిస్టెంట్ మేనేజర్లు 18 మంది ఉండగా 47 మంది స్టాఫ్ అసిస్టెంట్లు ఉన్నారన్నారు. ప్రొబేషన్ డిక్లరేషన్లు అందుకున్న వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు, ఇతరత్రా ప్రయోజనాలు వర్తింపజేస్తామని పేర్కొన్నారు. బ్యాంకు పురోభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కె.సురేఖారాణి, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

కళ్యాణదుర్గం: పట్టణంలోని వడ్డే కాలనీకి చెందిన ఇద్దరు యువకులపై పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ హరినాథ్ తెలిపారు. ఇటీవల అదే కాలనీకి చెందిన ఓ మైనర్ బాలికను ప్రేమ పేరుతో ఇంటి నుంచి తీసుకెళ్లిన ఘటనలో అదే కాలనీకి చెందిన రాజేష్, రామకృష్ణ అనే ఇద్దరు యువకులపై బాలిక, తల్లిదండ్రులు పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆదర్శప్రాయుడు పొట్టి శ్రీరాములు

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- ఘనంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం



అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు

అనంతపురం కార్పొరేషన్: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పార్టీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగనిరతి మరువలేనిదన్నారు. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని 56 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి ప్రాణాలు విడిచి, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. రాష్ట్రం విడిపోయాక గత టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్ర అవతరణ వేడుకలు జరగలేదని, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత ఏటా నవంబర్ 1న ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాబు మళ్లీ జైలుకెళ్లాల్సిందే...

'తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా హైకోర్టు మధ్యంతర బెయిల్ మాత్రమే మంజూరు చేసింది.. కానీ టీడీపీ నేతలు నిజం గెలిచింది అంటూ చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉంది' అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు పాత్ర ఉందని, ఆయనకు బెయిల్ ఇవ్వాలని దాఖలు చేసిన పిటీషన్ వాదనల సమయంలో చంద్రబాబు తరపు న్యాయవాదులు కంటి చికిత్సను ప్రస్తావించడం కారణంగానే బెయిల్ వచ్చిందన్నారు. స్కిల్ స్కాంలో చంద్రబాబు పీఏ శ్రీనివాస్ కీలకంగా ఉన్నారని, అయితే ఆయన్ను విదేశాలకు పంపించి విచారణకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. మధ్యంతర బెయిల్ ముగిశాక మళ్లీ బాబు జైలుకు వెళ్లాల్సిందేనన్నారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ నదీం అహ్మద్, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జోనల్ ఇన్‌చార్జులు రాజారాం, రిలాక్స్ నాగరాజు, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, సైపుల్లాబేగ్, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, వెన్నపూస రామచంద్రారెడ్డి, పామిడి వీరాంజనేయులు, శోభారాణి, రాధా పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై త్రీమెన్ కమిటీ విచారణ



అధ్యాపకులు, సిబ్బందిని విచారిస్తున్న త్రీమెన్ కమిటీ సభ్యులు

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సంజిత్ నాయక్‌పై త్రీ మెన్ కమిటీ సభ్యులు బుధవారం విచారణ జరిపారు. అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బందిని ప్రిన్సిపాల్ అకారణంగా వేధించడం, కించ పరిచే విధంగా మాట్లాడుతున్నారని గత కొద్దిరోజులుగా కాలేజీలో ఆందోళన జరుగుతున్నాయి. అధ్యాపకులు, విద్యార్థులు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ప్రిన్సిపాల్ ప్రవర్తన, తీరుపై ఫిర్యాదు కూడా చేశారు. ఈ క్రమంలో ఆర్‌జేడీ రవినాయక్ ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. త్రీ మెన్ కమిటీ సభ్యులు వెంకటరమణనాయక్ (డీవీఈఓ), నాగరత్నమ్మ (అనంతపురం కేఎస్ఆర్ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్), వెంకటరామిరెడ్డి (సీఐ గుత్తి) లతో పాటు రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియా బేగం తో కలిసి కాలేజీకి వెళ్లి విచారణ చేపట్టారు. నివేదికను ఆర్‌జేడీ రవినాయక్‌కు పంపారు. ఇదిలా ఉండగా విచారణ అధికారులతో కూడా ప్రిన్సిపాల్ సక్రమంగా నడుచుకోలేదని అంటున్నారు.

ప్రిన్సిపాల్‌ను డిస్మిస్ చేయాలని వినతి

విచారణ నిమిత్తం వచ్చిన డీవీఈఓ వెంకటరమణ నాయక్‌ను ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటనాయక్ , సభ్యులు కలిశారు. ప్రిన్సిపాల్ తీరు, ప్రవర్తన సక్రమంగా లేదని వెంటనే డిస్మిస్ చేయాలని వినతిపత్రం అందజేశారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పేకాట కేంద్రంపై మెరుపు దాడి

అనంతపురం క్రైం: నగరంలోని హౌసింగ్ బోర్డ్‌లోని పేకాట స్థావరంపై అనంతపురం వన్‌టౌన్ పోలీసులు మెరుపు దాడి చేశారు. కొంతకాలంగా అత్యంత రహస్యంగా సాగుతున్న పేకాట వ్యవహారం నేరుగా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ దృష్టికి వెళ్లడంతో వన్‌టౌన్ పోలీసులను అప్రమత్తం చేశారు. మంగళవారం రాత్రి స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి వన్‌టౌన్ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. బుధవారం సీఐ రెడ్డప్ప ఆ వివరాలను వెల్లడించారు. హౌసింగ్ బోర్డ్‌లో పేకాట స్థావరంపై దాడి చేసి 15 మంది పేకాటరాయుళ్లతో పాటు రూ.1.25 లక్షలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. స్కార్పియో, బొలెరో వాహనాలతో పాటు 15 సెల్‌ఫోన్లు, ఐదు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశామన్నారు.

మొబైల్ గ్యాంబ్లర్స్ ఆట కట్టిస్తాం

జిల్లా కేంద్రంతో పాటు శివారు ప్రాంతాల్లో మొబైల్ గ్యాంబ్లర్స్ టీములుగా ఏర్పడి స్థావరాలను మారుస్తూ పేకాటను జోరుగా సాగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. మొబైల్ గ్యాంబ్లర్ల కదలికలపై గట్టిగా ఉంచామని వారి ఆట కట్టిస్తామన్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇలాంటి కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

తల్లీకూతుళ్లపై టీడీపీ నాయకుడి దాడి

కణేకల్లు: కుటుంబ విషయంలో ఎందుకు జోక్యం చేసుకొంటున్నావని అడిగిన పాపానికి ఓ టీడీపీ నాయకుడు తల్లీకూతుళ్లపై కట్టెలతో దాడి చేశాడు. బాధితుల వివరాలమేరకు... కణేకల్లు మండలం పులచెర్లకు చెందిన లక్ష్మీ కూతురు అపర్ణ తన భర్తతో కలిసి బెంగళూరులో నివాసముంటోంది. లక్ష్మీ ఇంటి పక్కనే ఉన్న టీడీపీ నాయకుడు మంజు మీ అత్త పొలాన్ని ఎకరం రూ.30 లక్షలతో అమ్మకానికి పెట్టిందని చెప్పాడు. అపర్ణ భర్తకు తరచూ ఫోన్ చేసి అమ్మకాలు జరుగుతున్నాయని, అడ్వాన్స్‌లు కూడా తీసేసుకున్నారని లేనిపోని మాటలు చెప్పాడు. ఈ విషయమై అపర్ణ కాపురంలో కొన్ని సమస్యలు సైతం వచ్చాయి. ఇటీవల పుట్టింటికి వచ్చిన అపర్ణ తల్లితో జరిగిన విషయాలు చెప్పి బాధ పడింది. దీంతో వారిద్దరు కలిసి టీడీపీ నాయకుడైన మంజు ఇంటికెళ్లి అదే విషయంపై ప్రశ్నించారు. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన మంజు పీకలదాకా మద్యం సేవించి లక్ష్మీ ఇంటికెళ్లి ఆమెతో పాటు భర్త హేమారెడ్డి, కూతురిపై కట్టెలతో దాడి చేశాడు. గాయాలపాలైన వారు కణేకల్లు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు టీడీపీ నాయకుడు మంజు నుంచి ప్రాణహాని ఉందని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సంస్కృత పండితుడు నాగత్రిశూలపాణి కన్నుమూత



త్రిశూలపాణి (ఫైల్)

అనంతపురం కల్చరల్: సంస్కృత పండితుడు, ఆధ్యాత్మిక వేత్త, వ్యక్తిత్వ వికాస రచయిత డాక్టర్ పీవీడీ నాగత్రిశూలపాణి (65) బుధవారం హఠాన్మరణం చెందారు. మచిలీపట్నంకు చెందిన ఆయన ఉద్యోగరీత్యా 1982లో అనంతకొచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. 2018లో ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేసిన ఆయన ధర్మప్రచారానికి కృషి చేశారు. రామకృష్ణ కరుణామృతం, చిన్నారుల వివేకానందుడు పుస్తకాలతో పాటూ వందల వ్యాసాలను రచించారు. శ్రీరామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్తు రాయలసీమ విభాగం కన్వీనర్‌గా కొనసాగుతున్నారు. అనేక సందర్భాల్లో అనంత వేదికగా జాతీయస్థాయి సంస్కృత సదస్సులను ఆయన నిర్వహించారు. వివిధ రాష్ట్రాల్లో సాగిన శతావధానాల్లో పృచ్ఛకునిగా వ్యవహరించి అవధానాలను రక్తికట్టించారు. నాగత్రిశూలపాణికి భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు.

పలువురి సంతాపం

రామకృష్ణ పరమహంస జీవితాన్ని అతి దగ్గరగా పరిచయం చేయడంలో నాగత్రిశూలపాణి పాత్ర మరువలేనిదని రామకృష్ణ సేవా సమితి ప్రధాన కార్యదర్శి శ్రీధరమూర్తి, నాట్యాచార్యులు సంధ్యామూర్తి సంతాపం తెలియజేశారు. విద్యా ప్రచారమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలలో యువతను ప్రేరేపించి ఉత్తమ సమాజ నిర్మాణంలో పాలు పంచుకున్నారని సమితి ప్రతినిధి ప్రవీణ్ కుమార్, సాహిత్యభారతి నిర్వాహకులు రియాజుద్దీన్, డాక్టర్ నగరూరు రసూల్, డాక్టర్ శ్యామసుందరశాస్త్రి, వినాయక ఉత్సవ సమితి నిర్వాహకులు పరుచూరు రమేష్ నాగత్రిశూలపాణి మరణం పట్ల సంతాపం తెలిపారు.

ఊయలే ఉరితాడైంది !

- బాలుడి మృతితో కరిగానిపల్లిలో విషాదఛాయలు



మృతుడు బొమ్మలింగ

కుందుర్పి: సరదాగా ఊగుతున్న ఊయలే ఓ బాలుడి పాలిట ఉరితాడైంది. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న ఒక్కగానొక్క కుమారుడి మృతితో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసుల వివరాలమేరకు... మండలంలోని కరిగానిపల్లి గ్రామానికి చెందిన గొల్ల ఈరన్న, జయమ్మ దంపతులకు బొమ్మలింగ (11) ఒక్కగానొక్క కుమారుడు. దంపతులిద్దరూ కూలి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. బొమ్మలింగ స్థానికంగా ఉన్న యూపీ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. రోజువారీగానే బుధవారం ఉదయం కూడా వారిద్దరూ కూలి పనికి వెళ్లారు. స్కూల్‌కు వెళ్లు నాయనా అని బొమ్మలింగకు చెప్పి వెళ్లారు. అయితే వారు వెళ్లిన తర్వాత బొమ్మలింగ ఇంటి ముందు ఉన్న ఊయల ఊగుతున్నాడు. ఈ నేపథ్యంలోనే ఊయల తాడు గొంతుకు బిగుసుకోవడంతో ఊపిరాడక బాలుడు చనిపోయాడు. చుట్టుపక్కల కూడా ఎవరూ లేకపోవడంతో దారుణం జరిగిపోయింది. ఉన్న ఒక్క కొడుకూ మృతి చెందడంతో ఈరన్న, జయమ్మలు గుండెలవిసేలా రోదించారు. వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. ఈ ఘటనతో కరిగానిపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి.

లంచాన్ని రూపుమాపాలి

గుంతకల్లు: రైల్వే ఉద్యోగులు విధులను అంకిత భావంతో నిర్వర్తిస్తూ లంచగొండితనాన్ని రూపుమాపాలని దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ అరవింద్‌మల్కడే పేర్కొన్నారు. ఈనెల 3వ తేదీ వరకు జరిగే విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా బుధవారం ఆయన గుంతకల్లు డివిజన్‌కు విచ్చేశారు. స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌డీజీఎం, డీఆర్‌ఎం మనీష్‌అగర్వాల్, ఏడీఆర్‌ఎం సూర్యనారాయణ, సుధాకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌డీజీఎం మాట్లాడుతూ అవినీతి రహిత సమాజం ఏర్పడాలంటే తల్లిదండ్రులు తమ పిల్లలను సన్మార్గంలో నడిచేలా చూడాలన్నారు. ఉద్యోగులు అందరూ కలిసి పనిచేస్తూ అవినీతిని అరికట్టడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహన్, సీనియర్ డీసీఎం మనోజ్, ఆర్‌పీఎఫ్ డివిజనల్ కమిషనర్ టీ.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు అభిషేక్


శెట్టూరు: మండలంలోని ఖైరేవు గ్రామానికి చెందిన మాల అభిషేక్ (21) అనే యువకుడు బుధవారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు... ఖైరేవుకు చెందిన మాల మల్లికార్జున కుమారుడు అభిషేక్ రెండు నెలల నుంచి తన ముఖంపై ఉన్న మొటిమలకు ట్రీట్మెంట్ తీసుకుంటున్నాడు. అయితే మొటిమలు నయం కాకపోవడంతో తనను ఎవరు పెళ్లి చేసుకోరేమోనని ఆవేదన చెందాడు. ఇందులో భాగంగానే మనస్తాపంతో బుధవారం ఉదయం తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లిన తర్వాత ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్రూంలో పైకప్పుకున్న ఇనుప పైపుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు శెట్టూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

- ఇద్దరి అరెస్ట్. 3,744 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం

అనంతపురం క్రైం: కూడేరు మండలం మరుట్ల సమీపంలో సెబ్ ఇంటెలిజెన్స్ విభాగం పోలీసులు భారీగా కర్ణాటక మద్యం పట్టుకున్నారు. సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ వివరాలను విలేకరులకు తెలియజేశారు. సెబ్ ఇంటెలిజెన్స్ విభాగం సీఐ నరసానాయుడు, సిబ్బంది పక్కాగా వచ్చిన సమాచారంతో బుధవారం దాడులు నిర్వహించారన్నారు. కర్ణాటకలోని మొలకల్మూరు నుంచి కూడేరు మండలం మరుట్లకు అక్రమంగా మద్యం తరలించారన్నారు. మరుట్ల-1 నుంచి మరుట్ల-2 రహదారి మధ్యలోని కొండ ప్రాంతంలో మద్యాన్ని దాచి పెట్టారని పేర్కొన్నారు. 3,744 టెట్రా ప్యాకెట్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. మరుట్ల-2 కాలనీకి చెందిన నాగేంద్ర, మీనుగ రమేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఎరుకుల శివయ్య, అశ్వర్థ పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. పట్టుబడిన నిందితుల్లో నాగేంద్ర, శివయ్య పాత నేరస్తులని అదనపు ఎస్పీ తెలిపారు. వీరిపై త్వరలో పీడీ యాక్ట్ పెట్టనున్నట్లు తెలిపారు.

ఆరుకాళ్ల దూడ జననం



రామగిరి: మండలంలోని చిన్నకొండాపురంలోరైతు కురుబ వెంకటస్వామికి చెందిన ఆవుకు ఆరుకాళ్ల దూడ జన్మించినట్లు పశువైద్యుడు సునీల్ కుమార్ తెలిపారు. రెండురోజులక్రితం నాలుగు కాళ్లతో పాటు తొడభాగాన మరో రెండుకాళ్లతో దూడ జన్మించిందన్న సమాచారంతో ఆ గ్రామానికివెళ్లి దూడను పరిశీలించి మందులు అందించామన్నారు. జన్యులోపం కారణంగానే ఆరు కాళ్లతో దూడ జన్మించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం దూడ ఆరోగ్యంగానే ఉందన్నారు.

ఇద్దరు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి

అనంతపురం అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇద్దరు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి లభించింది. అనంతపురం కలెక్టరేట్‌లో ల్యాండ్ రీఫార్మ్స్ తహసీల్దారుగా ఉన్న సి.విశ్వనాథ్, శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం తహసీల్దారుగా ఉంటూ డిప్యుటేషన్‌పై రామాయపట్నం పోర్టు భూసేకరణ విభాగంలో పనిచేస్తున్న టి.శ్రీనివాసులు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు.

ఉన్నత విద్యలో సువర్ణాధ్యాయం

- దశాబ్దాల తర్వాత తొలిసారిగా యూనివర్సిటీల్లో భారీగా పోస్టుల భర్తీ
- గతంలో ఒక్కో వర్సిటీకి వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి
- తాజాగా ఒకే దరఖాస్తు రుసుముతో అన్ని వర్సిటీల్లోనూ చెల్లుబాటయ్యే వీలు
- ఎస్కేయూలో 125 అసిస్టెంట్, 63 అసోసియేట్, 17 ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

అనంతపురం: రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యలో సువర్ణ అధ్యాయం లిఖించింది. యూనివర్సిటీల్లో దశాబ్దాలుగా భర్తీకి నోచుకోని అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఏకంగా 205 పోస్టులు భర్తీ కానున్నాయి. ఇందులో 125 అసిస్టెంట్, 63 అసోసియేట్, 17 ప్రొఫెసర్ పోస్టులు ఉన్నాయి. ఉన్నత విద్యా మండలి ఉమ్మడి పోర్టల్ ద్వారా మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనుంది.

ఎస్కేయూలో విభాగాల వారీగా పోస్టులు..

- అసోసియేట్ ప్రొఫెసర్ (రెగ్యులర్): బయోకెమిస్ట్రీ -2 (ఓసీ-1, ఎస్సీ-1). బయో టెక్నాలజీ -2 (ఓసీ-1, బీసీ(ఏ)-1), బోటనీ - 2 (ఓసీ-2), కెమిస్ట్రీ (ఎస్సీ-1, ఎస్టీ-1), సివిల్ ఇంజినీరింగ్-2 (ఓసీ-1, బీసీ(బీ)-1).
- కామర్స్-2 (ఓసీ-1,డబ్ల్యూఎస్-1), కంప్యూటర్ సైన్సెస్ అండ్ ఇంజినీరింగ్ -2 (ఓసీ-1, బీసీ(సీ)-1), కంప్యూటర్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ -2 (ఓసీ-1, ఎస్సీ-1).
- ఎకనామిక్స్, అప్‌లైడ్ ఎకనామిక్స్ -2 (ఓసీ-1, బీసీ (డీ)-1), ఈఈఈ-2 (బీసీ-(ఈ)1, బీసీ-(ఏ)-1), ఈసీఈ -2 (ఈడబ్ల్యూఎస్-1, ఎస్సీ-1), ఇంగ్లిష్-2 (ఓసీ-1, బీసీ-(బీ)-1), జాగ్రఫీ-2 (ఎస్టీ-1, ఓసీ-1), లా - 1 (బీసీ(ఏ).
- లైబ్రరీ సైన్సెస్-1 (ఓసీ), మేనేజ్‌మెంట్ -2 (ఓసీ-1, ఈడబ్ల్యూఎస్-1), మేథమేటిక్స్ - 1 (ఎస్టీ), మెకానికల్ ఇంజినీరింగ్ - 2 (ఓసీ-1, బీసీ(బీ)-1), మైక్రో బయాలజీ -2 (ఓసీ-2), ఫార్మాస్యూటికల్ సైన్సెస్-2 (ఓసీ - 1,బీసీ (డీ)-1).
- ఫిజికల్ ఎడ్యుకేషన్ - 2 (ఓసీ-1, ఎస్సీ-1), ఫిజిక్స్-1 (ఈడబ్ల్యూఎస్-1), ఎలక్ట్రానిక్స్-1 (బీసీ- (డీ)1), పొలిటికల్ సైన్సెస్ - 2 (బీసీ- (ఈ)1, బీసీ(ఏ-1).
- పాలిమర్ సైన్సెస్-2 (ఓసీ-1, ఎస్సీ-1), రూరల్ డెవలప్‌మెంట్ -1 (ఓసీ-1), సోషల్ వర్క్-1 (బీసీ(బీ)-1), సెరికల్చర్-2 (ఈడబ్ల్యూఎస్-1, ఓసీ-1).
- సోషియాలజీ-2 (ఎస్సీ-1, ఓసీ-1), స్టాటిస్టిక్స్-1 (బీసీ(ఏ)-1), తెలుగు -1 (ఓసీ-1), యూసిక్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ -1 (ఓ.సీ-1), జువాలజీ -2 (ఓసీ-1, ఎస్టీ-1).
- అసోసియేట్ ప్రొఫెసర్లు (బ్యాక్‌లాగ్)-2
- అసిస్టెంట్ ప్రొఫెసర్లు (రెగ్యులర్)- 107, బ్యాక్‌లాగ్ - 6 (హిస్టరీ, పొలిటికల్ సైన్సెస్, మైక్రోబయాలజీ, ఎలక్ట్రానిక్స్, పాలిమర్ సైన్సెస్, సెరికల్చర్).
- ప్రొఫెసర్ పోస్టులు 32 భర్తీ చేస్తున్నారు. ఎస్కే యూనివర్సిటీ ఏర్పడిన తరువాత ఇంతటి భారీ స్థాయిలో ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేస్తుండడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ప్రతి విభాగానికి ఒక ప్రొఫెసర్ పోస్టును భర్తీ చేస్తున్నారు.
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఏపీపీఎస్సీ ద్వారా స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారు.


దరఖాస్తు రుసుము ఇలా..

- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు ఓపెన్ కేటగిరి, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.2,500, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.2 వేలు, ఎన్‌ఆర్‌ఐలు అయితే రూ. 4,200 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ మూడు పోస్టులకు అర్హత ఉంటే విడివిడిగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకే సబ్జెక్టు, ఒకే కేటగిరి అయితే ఒక దరఖాస్తుతో అన్ని యూనివర్సిటీల్లోని పోస్టులకూ పోటీపడవచ్చు. అసోసియేట్, ప్రొఫెసర్ పోస్టుకు రూ.3 వేలు దరఖాస్తు రుసుము నిర్దేశించారు.
- కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారికి ఏడాదికి ఒక మార్కు చొప్పున గరిష్టంగా 10 మార్కుల వెయిటేజీ కల్పిస్తున్నారు.
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫీజు చెల్లింపు గడువు నవంబర్ 20.
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్‌కు అర్హులు, అనర్హుల ప్రాథమిక జాబితాను నవంబర్ 30న ప్రదర్శిస్తారు.
- డిసెంబర్ -7న అభ్యంతరాల స్వీకరణ
- డిసెంబర్ 8న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు స్క్రీనింగ్ టెస్టుకు ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రదర్శన.

7న కళా ఉత్సవ్- 2023 పోటీలు

అనంతపురం ఎడ్యుకేషన్: కళా ఉత్సవ్-2023 జిల్లా స్థాయి పోటీలు ఈనెల 7న సత్యసాయి జిల్లా బుక్కపట్నం డైట్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో విద్యానుబంధ అంశాల్లో ప్రతిభ వెలికి తీయాలనే ఆశయంతో ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో ఈ కళా ఉత్సవ్-2023 నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఓకల్ మ్యూజిక్ సోలో (క్లాసికల్, ట్రెడిషనల్ ఫోక్), ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ సోలో, డ్యాన్స్ సోలో (క్లాసికల్, ట్రెడిషనల్ ఫోక్), విజువల్ ఆర్ట్స్, డ్రామా అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. జాతీయస్థాయిలో ప్రతి కేటగిరీకి మొదటి బహుమతి రూ. 25 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.15 వేలు ఉంటుందన్నారు. అలాగే నూతన పార్లమెంట్ సందర్శనకు అవకాశం కల్పిస్తారన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ పిల్లలను సంసిద్ధులను చేసేలా ప్రాక్టీస్ చేయించాలని కోరారు.

డిసెంబర్ 15న పెన్షన్ అదాలత్



గుంతకల్లు: రైల్వే పెన్షన్ దారుల సమస్య పరిష్కారం కోసం డిసెంబర్ 15న పెన్షన్ అదాలత్ జరగనుంది. ఈ మేరకు సీనియర్ డీపీఓ చౌహన్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్స్ ఫెడరేషన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి వి.సుంకప్ప తెలిపారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు తమ సమస్యలపై నిర్ణీత ప్రొఫార్మాలో ఈ నెల 15వ తేదీలోపు డీఆర్‌ఎం కార్యాలయంలోని సీనియర్ డీపీఓ ఆఫీస్‌లో అందజేయాలని సూచించారు.

సీఎంను కలిసిన ఆలూరు




శింగనమల: విజయవాడలో బుధవారం వైఎస్సార్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి కలిశారు. అక్కడికి వచ్చిన గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆలూరు సాంబశివారెడ్డిని సీఎం జగన్ పరిచయం చేశారు.

సేవలు సద్వినియోగం చేసుకోండి

అనంతపురం మెడికల్: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది అక్టోబర్ 31 నుంచి దాదాపుగా 50 వేల మంది రోగులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. న్యూరో 350, యూరాలజీ 5 శస్త్రచికిత్సలు, 105 మందికి యాంజియోప్లాస్టీ, 318 మందికి చిన్న శస్త్ర చికిత్సలు చేయడం జరిగిందన్నారు. నెఫ్రాలజీ విభాగంలో 379 మందికి డయాలసిస్ సేవలు అందించినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

ఉరవకొండ: మండల పరిధిలోని కౌకుంట్ల వద్ద పాత వైరాంపురం రోడ్డు దగ్గర హంద్రీనీవా కెనాల్ పక్కన ఉన్న మట్టిదిబ్బల దగ్గర బుధవారం పోలీసులు గుర్తు తెలియని వృద్ధుడి శవాన్ని గుర్తించారు. ఎస్ఐ వెంకటస్వామి వివరాలమేరకు... సుమారు 65 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తు తెలియని వృద్ధుడు సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి మృతి చెందినట్లు తెలుస్తోందన్నారు. మృతుడు తెలుపు రంగు ఫుల్‌షర్ట్, మెరూన్ రెడ్ డ్రాయర్‌తో ఉన్నాడన్నారు. మృతదేహాన్ని గుర్తు పట్టిన వారు అర్బన్ సీఐ తిమ్మయ్య సెల్ నంబర్: 9490108514కు సమాచారమివ్వాలన్నారు.

క్లుప్తంగా

తలుపుతట్టి..'కానుక' అందజేసి..



సింగంపల్లి గ్రామంలో అన్నోబిలేసుకు రూ.10 వేల పింఛన్ అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ మండలంలో బుధవారం తెల్లవారుజామునే ప్రారంభమైంది. వలంటీర్లు తలుపుతట్టి మరీ లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుక అందజేశారు. 1వ తేదీనే జీతం అందినట్లు పింఛన్ డబ్బు అందడంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలోని సింగంపల్లి గ్రామానికి చెందిన అన్నోబులేసు రెండు కిడ్నీలు దెబ్బతినగా, డయాలసిస్ చేయించుకుంటున్నాడు. దీంతో ప్రభుత్వం అతనికి రూ.10 వేల పింఛన్ మంజూరు చేయగా, బుధవారం సర్పంచ్ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్ తదితరులు వలంటీర్‌తో కలిసి అన్నోబిలేసు ఇంటివద్దకు వెళ్లి వైఎస్సార్ పింఛన్ కానుక అందజేశారు.

డీఏ పెంపుతో తపాలా ఉద్యోగుల ఆనందం

అనంతపురం సిటీ: డీఏ నాలుగు శాతం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో గ్రామీణ తపాలా ఉద్యోగుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇప్పటికే 42 శాతం ఉన్న డీఏను మరో నాలుగు శాతం పెంచి మొత్తం 46 శాతం పెంచడం ఆనందంగా ఉందని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ అనంతపురం డివిజన్ కార్యదర్శి కృష్ణయ్య యాదవ్ అన్నారు. తాము చేసిన పోరాటాల ఫలితంగానే నాలుగు శాతం డీఏ సాధించుకోగలిగామని పేర్కొన్నారు. మిగిలిన డిమాండ్లను పరిష్కరించే విషయంలోనూ తపాలా ఉన్నతాధికారులు సానుకూలంగా వ్యవహరిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. లేదంటే వచ్చే నెల 5 నుంచి నిరవధిక సమ్మె చేపడతామన్నారు

సురేష్ కుమార్‌కు డాక్టరేట్



అనంతపురం: తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం(ఎస్వీయూ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగంలో పరిశోధన చేసిన ఎ.సురేష్‌కుమార్‌కు బుధవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈఈఈ విభాగం ప్రొఫెసర్ వి.ఉషారెడ్డి పర్యవేక్షణలో 'ఫర్‌ఫార్మెన్స్ అనాలిసిస్ టు ఇంప్రూవ్ ఎఫిషియన్సీ ఆఫ్ పీవీ సిస్టమ్ ఇన్ వారియర్ కాన్ఫిగరేషన్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌ను ప్రచురించారు. అనంతపురం నగరానికి చెందిన సురేష్ కుమార్ ప్రస్తుతం కర్నూలులో స్థిరపడ్డారు. ఈయనకు డాక్టరేట్ రావడంపై పలువురు ప్రొఫెసర్లు, పరిశోధన విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.


నేడు షష్టిపూర్తి వేడుకలు

అనంతపురం కల్చరల్: నగరంలోని గుత్తిరోడ్డు బల్లా కన్వెన్షన్ హాలులో గురువారం వృద్ధులకు షష్టిపూర్తి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. తమిళనాడులోని తీరుకడయార్, సాయిట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో 60 ఏళ్ల దాటిన వందలాది మందికి షష్టిపూర్తి ఉచితంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఘనంగా కాళిదాస జయంతి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఆర్ట్స్ కళాశాల సంస్కృత విభాగం ఆధ్వర్యంలో బుధవారం 'కాళిదాస జయంతి'ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ఆశావాది శశాంక మౌళి , సంస్కృత ఉపన్యాసకులు డాక్టర్ సుధామ వంశీ ప్రసంగించారు. కాళిదాసు సంస్కృతంలో రచించిన మేఘ సందేశం, అభిజ్ఞాన శాకుంతలం చిరస్థాయిగా నిలిచిపోయే మహత్తర కావ్యాలని పేర్కొన్నారు. ఈ కావ్యాల్ని ప్రేరణగా తీసుకొని ప్రపంచంలోని అనేక భాషలలో కవితలు, కావ్యాలు, కథలు, నవలలు, నాటకాలు, సినిమాలు వెలువడ్డాయన్నారు. కార్యక్రమంలో హిందీ ఉపన్యాసకులు నరసింహం, సోమశేఖర్ పాల్గొన్నారు.

సేవల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: ప్రభుత్వం మహిళలు, చిన్నారులకు అందిస్తున్న సేవల వివరాలను ఆన్‌లైన్‌లో తప్పక నమోదు చేయాలని డీఎంహెచ్ఓ ఈ భ్రమరాంబ దేవి ఆదేశించారు. బుధవారం స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతా శిశు మరణాలు, ప్రసవాలు, హైరిస్క్ గర్భిణుల వివరాలను సక్రమంగా నిర్వహించడానికి సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో గణాంకాధికారి మారుతీ ప్రసాద్, ఉప గణాంకాధికారి గోవింద గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి ఆశయాలు కొనసాగిద్దాం



పొట్టి శ్రీరాములు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు , కమిషనర్ తదితరులు

రాప్తాడు: అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం వల్లే ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం రాప్తాడులో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని ఎప్పటికీ మరచిపోకూడదన్నారు. స్వాతంత్య్ర ఉద్యమంలోనూ పొట్టి శ్రీరాములు ప్రధాన భూమిక పోషించారన్నారు. ఆ మహనీయుల బాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తూ... రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతోనే మూడు రాజధానులు ప్రకటించారన్నారు.

అనంతపురం కల్చరల్: అమరజీవి ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అని పొట్టి శ్రీరాములు పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కలవల సతీష్ అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం కలవల సతీష్ నేతృత్వంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మంజునాథ్, నగేష్, మధు తదితరులు నగరంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు నిరుపమాన త్యాగం వల్ల రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలుగు జాతికి ఎనలేని సేవలందించి ప్రాణాలను సైతం అర్పించిన ఆయనకు అందరం రుణపడి ఉన్నామన్నారు.

అనంతపురం కార్పొరేషన్: పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే రాష్ట్రం ఆవిర్భవించిందని మేయర్ వసీం అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యతో కలసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. మేయర్ మాట్లాడుతూ దేశంలో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందిందన్నారు. రాష్ట్ర ఆవిర్భావం కోసం కృషి చేసిన మహానుభావుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, కమల్‌భూషణ్, శ్రీనివాసులు, సంపంగి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అమరజీవి

అనంతపురం: అమరజీవి పొట్టిశ్రీరాములు ఆదర్శప్రాయులని జేఎన్‌టీయూ అనంతపురం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన అన్నారు. జేఎన్‌టీయూలో బుధవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాలక భవనంలో పొట్టిశ్రీరాములు, తెలుగుతల్లి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఓటీపీఆర్ఐలో జరిగిన రాష్ట్రావతరణ దినోత్సవంలో డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

- శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్రావతరణ దినోత్సవానికి వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పొట్టి శ్రీరాముల త్యాగం నిరుపమానమని కొనియాడారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చిట్టా సురేష్, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ ఎల్.శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.
- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద పలువురు నివాళి అర్పించారు. గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి, మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, కార్యదర్శి రమ తదితరులు పాల్గొన్నారు.



జేఎన్‌టీయూలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ జింకా రంగజనార్ధన తదితరులు



ఎస్కేయూలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి తదితరులు



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి, కార్యదర్శి రమ తదితరులు



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కక్షలు రేపుతున్న వారిపై చర్యలు తీసుకోండి



టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నేతలు

ఆత్మకూరు: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లోని ప్రజలను రెచ్చగొడుతూ, కక్షలకు ఆజ్యం పోస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కురుబ జొన్నగిరి బాలపోతన్న కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూజారి లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డితో కలసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్కిల్ స్కాంలో జైలులో ఉన్న చంద్రబాబు బెయిల్‌పై విడుదల కాగా, అక్టోబర్ 31న మండలంలోని పి.సిద్దరాంపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ప్రభుత్వ పాఠశాల పక్కన కొడవళ్లతో గొర్రెలు నరుకుతూ, మొండెంతో ఉన్న గొర్రెలను తీసుకెళ్లి చంద్రబాబు చిత్ర పటానికి రక్తాభిషేకం చేశారన్నారు. అంతేకాకుండా కొడవళ్లతో గొర్రెలను నరికిన వీడియోలు, ఫొటోలతో 'మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ తలలే కాదు... ఏ తలలైనా నరుకుతాం' అంటూ వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్నారు.

ప్రజలను భయపెట్టేందుకే..

ఎలాగైనా టీడీపీని అధికారంలోకి తీసుకురావాలని భావిస్తున్న ఆ పార్టీ నాయకులు అరాచకాలకు తెగబడుతున్నారని వైఎస్సార్ సీపీ నేతలు అన్నారు. సిద్ధరాంపురంలో కురుబలు ఐకమత్యంగా ఉంటూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తున్నారని, దీన్ని ఓర్వలేని టీడీపీ నాయకులు వారిని భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈక్రమంలోనే గొర్రెల తలలు నరికి సోషల్ మీడియాలో పోస్టులు చేశారన్నారు. 2019 ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా ఉన్న జొన్నగిరి బాలపోతన్నపై టీడీపీ నేతలు రాళ్లతో దాడి చేశారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పార్టీలకు అతీతంగా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికి అందేలా చేస్తున్నారన్నారు. ముఖ్యంగా పేరూరు డ్యాంకు నీరు తీసుకువచ్చి వలసలు వెళ్లిన వారు కూడా తిరిగి గ్రామాలకు వచ్చి వ్యవసాయం చేసేలా చర్యలు తీసుకున్నారన్నారు. అలాగే ఉచితంగా బోర్లు వేయించి రైతులకు అండగా నిలిచారన్నారు. ఏ కష్టం వచ్చినా అన్ని విధాల ప్రజలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. అందువల్లే జనమంతా వైఎస్సార్ సీపీ వెంట నడుస్తున్నారని, దీన్ని ఓర్వలేని టీడీపీ నేతలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని శిక్షించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు సంజన్న, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మేమంతా నీ వెంటే జగనన్నా



ఆత్మకూరులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న 'చేదోడు' లబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన లబ్ధిదారులు

ఆత్మకూరు: ''గతంలో మా గురించి పట్టించుకున్న వారే లేరు. కానీ మీరు మాకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. మీ సాయం ఎప్పటికీ మరువలేం. మిమ్మల్ని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటాం'' అంటూ జగనన్న చేదోడు లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బుధవారం ఆత్మకూరులో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులు తొలుత దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జగనన్న చేదోడు కార్యక్రమంలో భాగంగా టైలర్లు, రజకులు, నాయీబ్రాహ్మణులకు ఏటా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఆర్థిక సాయం చేసిందుకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్రాముడు, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, సచివాలయ కన్వీనర్లు వెంకటేష్, శ్రీరామ్, మురళి, వైఎస్సార్ సీపీ నాయకులు కాయగూరల ముత్యాలన్న, వెంకట్రామిరెడ్డి, వన్నూరప్ప, కొండా, రామాంజి, మాదన్న, రజకులు నరేంద్ర, ఎర్రిస్వామి, మురళి, వెంకటేష్, టైలర్లు షర్మస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యా సంస్థల్లో అధిక ఫీజులు

- చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ వినతి



నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో పదో తరగతి పరీక్ష ఫీజును ప్రభుత్వం నిర్ణయించిన దాని కంటే ఎక్కువ వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఈఓ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణయ్య, కుల్లాయిస్వామి మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష ఫీజు ప్రభుత్వం నిర్ణయించినది రూ.125 అయితే ఏకంగా రూ.500- 600 వసూలు చేస్తున్నారని తెలిపారు. అలాంటి విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు ఉమామహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, నాయకులు ఆనంద్, విశ్వనాథ్, కార్తీక్ తదితరులు ఉన్నారు.

మంజునాథ్‌కు విశిష్ట సేవా పురస్కారం

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన సత్రసాల మంజునాథ్ విశిష్ట సేవా పురస్కారం అందుకున్నారు. బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో గ్లోబల్ టాలెంటెడ్ లేడీస్ అండ్ కిడ్స్ అసోసియేషన్, తిందు బాయ్స్ ఫౌండేషన్ నిర్వాహకులు గరికపాటి జయలక్ష్మి, సుజాతమ్మ చేతుల మీదుగా పురస్కారం స్వీకరించారు. ఆయన అనంతలో వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా చేస్తున్న సేవలను నిర్వాహకులు కొనియాడారు. మంజునాథ్ మార్కెట్ యార్డు డైరెక్టర్‌గానూ సేవలందిస్తున్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, మండలంలోని ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

రాప్తాడు: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సూచించారు. బుధవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, నాయకులతో మండల అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 'జల జీవన్' పథకం కింద ప్రసన్నాయపల్లి, బోమ్మెపర్తి, పుల్లలరేవు, గొల్లపల్లి, రాప్తాడు, ఎం.బండమీదపల్లి గ్రామ పంచాయతీల్లో రూ.73 లక్షల నిధులతో పనులు జరుగుతున్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే మరో 8 పంచాయతీల్లోనూ జల జీవన్ పథకం రూ.2.45 పనులకు టెండర్లు పిలిచామన్నారు. జగనన్న హౌసింగ్ లేఅవుట్లకు సంబంధించి రూ. 1.75 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని, వాటిని తాగునీటి సరఫరాకోసం వాడుకోవాలన్నారు. మండలంలోని సీసీరోడ్ల వర్కులకు రూ.2.17 కోట్లు మంజూరయ్యాయని, వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. 'ఉపాధి' నిధులు రూ.60 లక్షలు, 'గడప గడపకూ మన ప్రభుత్వం' కింద రాప్తాడుకు రూ.40 లక్షలు, ప్రసన్నాయపల్లి పంచాయతీకి రూ.20 లక్షల నిధులు వచ్చాయని, వాటిని అభివృద్ధి పనులకు వెచ్చించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సి.మునివేలు, ఎంపీడీఓ సాల్మన్, మండల ఇంజినీర్ ఓబుల్‌దాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు వెంకటేష్, పసుపుల ఆది, వైస్ ఎంపీపీ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి, మండల అగ్రి బోర్డు చైర్మన్ కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ట

యల్లనూరు: గడ్డంవారిపల్లి ఎస్సీకాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట బుధవారం ఘనంగా జరిగింది. వేకువజామున నుంచి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా స్వాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. టీడీపీ రూ.10 లక్షలు, గ్రామస్తులు రూ.10 చందాలు వేసుకుని ఆలయాన్ని నిర్మించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువనేత ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి స్వాములను దర్శించుకుని పూజలు చేయించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనేయరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



విగ్రహాలను ప్రతిష్ఠించిన దృశ్యం

కల్లూరులో ఆక్రమణల తొలగింపు

గార్లదిన్నె: కల్లూరు పంచాయతీలోని కొండ కింద కొట్టాల సమీపంలో లక్ష్మీనరసింహ ఆలయ మాన్యంలో ఏర్పాటు చేసిన కట్టడాలను అధికారులు బుధవారం తొలగించారు. ఈసందర్భంగా దేవదాయ శాఖ అధికారులు మాట్లాడుతూ గ్రామంలో 165 సర్వే నంబర్‌లో లక్ష్మీనసింహస్వామి ఆలయానికి సంబంధించి 3.47 ఎకరాల భూమి ఉందన్నారు. ఇందులో కొందరు అనుమతి లేకుండా కట్టడాలు నిర్మించారని, నోటీసులు అందించినా స్పందించక పోవడంతో పోలీసులు సాయంతో కూల్చివేశామన్నారు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషునాయుడు, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి, ఇటుకులపల్లి సీఐ నరేంద్రరెడ్డి, సీఐ అస్రార్‌బాషా, గార్లదిన్నె ఎస్ఐ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.



అక్రమ కట్టడాలను తొలగిస్తున్న దృశ్యం

రైల్వే క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ విజయం



డెలిగేట్‌గా గెలిచిన దాదా ఖలందర్



నాయబ్ రసూల్



రితీష్‌కుమార్

గుత్తి: గత నెల 19న సికిందరాబాద్ రైల్వే కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు జరిగాయి. గత మంగళవారం రాత్రి సికిందరాబాద్‌లో ఓట్ల లెక్కింపు జరిగింది. గుంతకల్లు డివిజన్ లో 28 డెలిగేట్ పదవులు ఉండగా అన్నింటిలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ విజయ దుందుభి మోగించింది. గుత్తి నుంచి దాదా ఖలందర్(డీజిల్‌షెడ్), నాయబ్ రసూల్(డీజల్‌షెడ్), రితీష్ కుమార్(లోకో పైలెట్) డెలిగేట్లుగా గెలుపొందారు. విజేతలను దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు బుధవారం అభినందించారు.

వ్యక్తి అదృశ్యం

పెద్దపప్పూరు: యాడికి అంకాలమ్మ కాలనీకి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కాలనీకి చెందిన పెద్దయ్య బుధవారం ఉదయం భార్య ఉమాదేవికి పొలానికి వెళ్తున్నట్లు చెప్పి బయలుదేరాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.



పెద్దయ్య(ఫైల్)

ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తేయాలి

- వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్

అనంతపురం ఎడ్యుకేషన్: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంగా అనంతపురం నగరంలోని తారకరామ కొట్టాలు వైఎస్సార్ ప్రాథమిక పాఠశాల టీచరు భాగ్యలక్ష్మి, ఆత్మకూరు మండలం పి.యాలేరు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జయమణిని సస్పెండ్ చేశారని, వారిపై సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.శ్రీధర్‌గౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ పర్యటన నేపథ్యంలో వీరిపై చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. చిన్నచిన్న కారణాలతోనే సస్పెన్షన్ వేటు వేయడం సరికాదని తెలిపారు.

బస్సు యాత్ర పోస్టర్ల విడుదల

ఆత్మకూరు: సీపీఎం చేపట్టిన 'ప్రజా రక్షణ భేరి' బస్సు యాత్ర పోస్టర్లను బుధవారం మండల కేంద్రంలో ఆ పార్టీ మండల కార్యదర్శి శివశంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని సమాజం కోసం సీపీఎం రాష్ట్రవ్యాప్త బస్సు యాత్ర చేపట్టిందన్నారు. బస్సు యాత్ర ముగింపు సభ ఈనెల 15వ తేదీన విజయవాడలో ఉంటుందన్నారు. ఈ యాత్రలో రైతులు, కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెదయ్య, భాస్కర్‌రెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.